**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది:24.12.2025** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్య, వైద్య సేవలను అట్టడుగు వర్గాలకు అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.
2. వివిధ శాఖల్లో పని చేస్తున్న రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పూర్తి వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
3. రాష్ట్రంలోని గురుకులాలు, మోడల్ పాఠశాలలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
4. యూరియా కొనుగోలు కోసం ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ ను ఇప్పటి వరకు లక్ష మంది రైతులు డౌన్ లోడ్ చేసుకున్నారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

.......................................................................

**కిషన్ రెడ్డి**

దేశంలోని గనుల రంగం భవిష్యత్తుకు.. ఇండియన్ భారత గనుల త్రవ్యకం శాస్త్ర విద్యా సంస్థ కీలకమైన సంస్థని, ప్రతిభావంతమైన ఇంజనీర్లు, ఆధునిక సాంకేతికత, దేశ గనులకు భవిష్యత్తును అందజేస్తున్న అద్భుతమైన సంస్థ అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జార్ఖండ్‌లోని ఐఎస్ఎం-ధన్‌బాద్‌లో ‘కీలకమైన ఖనిజాల విశిష్ట అధ్యయన

కేంద్రాన్ని' ను కిషన్ రెడ్డి నిన్న ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తూ.. ధన్‌బాద్ ఇప్పుడు 'గనుల సాంకేతిక పరిజ్ఞాన రాజధాని' గా మారనుందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే గనుల రంగాన్ని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగిందని చెప్పారు.

..... పీఎన్

**వివరాలు**

ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన పూర్తి వివరాలు వచ్చేనెల 26 వ తేదీ లోగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

.......... డెస్క్

**భట్టి**

రాష్ట్రంలో విద్యను పటిష్టం చేసేందుకు గురుకులాలతోపాటు, మోడల్ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఖమ్మం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యార్థుల హాజరు శాతంలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు.

.........PTC, khammam

**తుమ్మల**

వ్యవసాయశాఖ యూరియా కొనుగోలు కోసం ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన మొబైల్‌యాప్‌ను లక్ష మంది రైతులు డౌన్‌లోడ్ చేసుకున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యూరియా పంపిణీపై నిన్న సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ... యాప్ ద్వారా 19వేల 695 మంది రైతులు మొత్తం 60వేల 510 యూరియా బస్తాలను కొన్నారని చెప్పారు. 217 మంది కౌలు రైతులు కూడా 678 బస్తాలు బుక్ చేసుకున్నారని తెలిపారు. మొదటి రోజు అక్కడక్కడ సాంకేతిక సమస్యలు తలెత్తగా వాటిని వెంటనే పరిష్కరించామన్నారు.

.......జీఎస్

**బదిలీలు**

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో సాధారణ బదిలీలకు అనుమతిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ నిన్న ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 31వ తేదీ లోగా కొన్ని పరిమితులకు లోబడి సాధారణ బదిలీలు పూర్తి చేయాలని ఆదేశించింది.

.........డెస్క్

**పగిడిద్దరాజు**

ములుగు జిల్లా మేడారంలో నూతనంగా నిర్మించిన పాలరాతి గద్దెలపై ఈరోజు పగిడిద్దరాజు, గోవిందరాజుల పునః ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం వారిని పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ..

**బైట్ - సీతక్క**

.........ములుగు

**శ్రీధర్ బాబు**

కరీంనగర్ జిల్లాలోని మానేరువాగుపై చెక్‌డ్యాం కూలిన ఘటనలో నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తామని, బాధ్యులను ఎవరినీ వదిలిపెట్టబోమని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి వద్ద మానేరువాగుపై కూలిన చెక్‌డ్యాంను అధికారులు, గ్రామస్థులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, బ్యారేజీలు నాణ్యత లోపంతో కూలిపోతున్నాయన్నారు. కమీషన్ల కోసం చెక్‌డ్యాంలు నిర్మించారని, విజిలెన్స్ విచారణలో అన్ని విషయాలు బహిర్గతమవుతాయని పేర్కొన్నారు.

........డెస్క్

**ఉపాధి**

కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసి మరింతగా పేద ప్రజలకు ఉపయోగపడేలా వీబీ జీ రామ్ జీ బిల్లును తీసుకొచ్చిందని కరీంనగర్ జిల్లా బోర్నపలికి చెందిన విద్యా వేత్త జిల్లా సుధాకర్ అన్నారు. ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ..

1) **జిల్లా సుధాకర్................. బైట్**

**ఉత్తమ్**

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం జరిగిందని, 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద ఒక్క కాలువ కూడా తవ్వలేదని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. నిన్న సాయంత్రం హైదరాబాద్ లో విలేకరుల సమావేశంలో మంత్రి పవర్ పాయింట్

ప్రజంటేషన్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని సాగునీటి పారుదల రంగానికి దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, కానీ, ఆ అప్పులతో రాష్ట్రానికి జరిగిన ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ అన్నారు.

....జీఎస్

**నట్టల నివారణ**

గొర్రెలు, మేకలకు పకడ్బందీగా నట్టల మందు పంపిణీ చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ...

**బైట్ ...............**

**(బోర్నపల్లి హుజురాబాద్, కరీంనగర్ జిల్లా)**

.........కరీంనగర్

**ప్రవేశాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆన్ లైన్ లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బద్దెనపల్లి బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో 5 నుంచి 9వ తరగతి వరకు చేరాలనుకునే విద్యార్థులు వచ్చేనెల 21 లోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

......సిరిసిల్ల

**గవర్నర్**

వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్య, వైద్య సేవలను అట్టడుగు వర్గాలకు అందించి బలమైన సమాజం, భారత దేశం నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

అన్నారు. నిన్న సాయంత్రం వనపర్తి జిల్లాలో గవర్నర్ సందర్శించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో విద్యా, వైద్యం, యాంటీ నార్కోటిక్స్ శాఖలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల ప్రదర్శనశాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు పథకాల పురోగతిని గవర్నర్ కు వివరించారు.

........వనపర్తి

**ఘంటా చక్రపాణి**

ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓపెన్ యూనివర్సిటీస్(ఏఏఓయూ) కార్యనిర్వాహక సభ్యుడిగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఎంపికయ్యారు. 2026-26 కాలానికి కార్యనిర్వాహక సభ్యులుగా చక్రపాణిని నియమిస్తూ.. ఏఏఓయూ సెక్రెటరీ జనరల్ ప్రొఫెసర్ రహమత్ అధికారిక సమాచారం పంపించారు.

......డెస్క్

**బ్యాంకు ఖాతాలు**

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లలో కేంద్ర ఆర్థిక సంఘం, రాష్ట్ర వాటా నిధుల జమ కోసం కొత్తగా బ్యాంకు ఖాతాలను తెరవాలని ఆదేశిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక ఖాతా కోసం గ్రామసభ, మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారికంగా తీర్మానం చేయాలని, ఆ ఖాతా గ్రామ పంచాయతీ లేదా మండల పరిషత్ పేరిట ఉండాలని పేర్కొన్నారు. కాగా, ఉప సర్పంచ్ లకు చెక్ పవర్ రద్దు చేసినట్లు నిన్న ప్రచారం జరిగిన వార్తలు అవాస్తవమని పంచాయతీ రాజ్ శాఖ వివరణ ఇచ్చింది.

......డెస్క్

**ఉత్తర్వులు**

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలపై ఆబ్కారీశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు 31న బార్లు, క్లబ్‌లు, పర్యాటక ప్రాంతాలు, ఈవెంట్ నిర్వహణకు అనుమతి తీసుకున్న వారికి రాత్రి ఒంటిగంట వరకు మద్యం సేవించేందుకు అనుమతినిస్తూ ఆబ్కారీశాఖ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం దుకాణాల్లో రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు చేయొచ్చన్నారు.

డెస్క్